విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

బుధవారం 21 మే 2025 8 పేజీలు

- నిరసనలు తెలిపిన కార్మికులు, కర్షకులు, కూలీలు
- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- పంటల మద్దతు ధరకు చట్టం తేవాలి
- విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి
- కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- ఉపాధి హామీ పథకం 200 రోజులు ఉండాలి
- రోజువారి కూలీ రూ.600లకు పెంచాలి
- డిమాండ్ చేసిన ప్రజా సంఘాల నేతలు

సమ్మె సక్సెస్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ, రైతులు పండించిన పంటలకు సి 2 ప్లస్ 50శాతం మద్దతు ధరకు చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ప్రకాశం జిల్లాలో నిరసన కార్యక్రమాలు, ర్యాలీలు, హర్తాళ్లు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను, హక్కులను తుంగలో తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రధాని మోదీ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతులు పండించిన పంటకు మద్దతు ధరల చట్టం చేయాలని, రైతుల, వ్యవసాయ కార్మికుల, కౌలు రైతుల రుణాలు రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు, రోజువారి కూలీ రూ.6 వందలకు పెంచాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం తేవాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయాలని, ధాన్యం, పొగాకు, మిర్చి, కోకో, సెనగ, మినుము పంటలను ప్రభుత్వమే వెంటనే కొనుగోలు చేయాలని, పాల రైతులకు లీటరుకు రూ.10 ప్రోత్సాహం ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి, నిధులు కేటాయించి వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.

-విశాలాంధ్ర, ఒంగోలు :

2లో

2లో

టంగుటూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

-విశాలాంధ్ర బ్యూరో, ఒంగోలు :

అకాల వర్షం..రైతన్నకు కష్టం

ముండ్లమూరులో అకాల వర్షంతో తడిసిన మిరపకాయలను ఆరబెడుతున్న రైతు

2 లో

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- అక్రమ తవ్వకాలు జరిపితే ఉపేక్షించం
- రవాణా చేసే వాహనాలు సీజ్ చేయాలి
- కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల :

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై అధికారులు ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ఎన్ఫోర్స్మెంట్ కార్యకలాపాలు మరింత పెరగాలి, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఇసుక రేవుల వద్ద అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు లేని వాహనాలు రేవు నుంచి బయటకు వెళ్లరాదన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ నెల నుంచి ఇసుక తవ్వకాల నిషేధం అమలులోకి

మిగతా 2 లో ...

23న ప్రకాశం జిల్లా మహానాడు

టీడీపీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు 'ప్రకాశం జిల్లా మహానాడు' కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీన సాయంత్రం 3 గంటలకు ఒంగోలులోని బృందవనం ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడం జరుగుతుందని ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. నూకసాని మాట్లాడుతూ మే 28న విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, పద్మశ్రీ, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ముందస్తుగా ప్రకాశం జిల్లాలో జిల్లా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ

మిగతా 2 లో ...

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి..

విశాలాంధ్ర - చీరాల :

టైరు పేలి కారు బోల్తా పడటంతో ముగ్గురు యువకులు మృతి చెంది, ఐదుగురు గాయాలు పాలైన ఘటన చీరాల మండలం వాడరేవు మెడికల్ కాలేజీ సమీపంలో చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా చీరాలకు గుంటూరు, తెనాలి ప్రాంతానికి చెందిన 9 మంది యువకులు వాడరేవు సముద్ర స్నానానికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో వాడరేవు మెడికల్ కాలేజీ సమీపంలో చేరుకునేసరికి కారు టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోహిత్ నాయక్ (19) అజరు (18) అనే యువకులు అక్కడికక్కడే మతి చెందారు. స్థానికుల గమనించి క్షతగాత్రులను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ కార్తీక్ (24) అనే మరో యువకుడు మృతి చెందాడు. కాగా మరో ఐదుగురుకు గాయాలు కావడంతో ఏరియా వైద్యశాలలో వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com బుధవారం 21 । మే । 2025

సమ్మె సక్సెస్

విశాలాంధ్ర - ఒంగోలు : లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఒంగోలు మున్సిపల్ ఆఫీసు నుండి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన,ధర్నా జరిగింది.మంగళవారం దేశవ్యాప్తంగా అఖిల పక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు , ఉమ్మడిగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఇచ్చిన పిలుపులో భాగంగా నిర్వహించారు. పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్, ఏఐయఫ్టియు న్యూ జిల్లా కార్యదర్శి ఎం ఎస్ సాయి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చాజిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు పాల్గొని మాట్లాడుతూ మోడీ విధానాలకు వ్యతిరేకంగా లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులు పెంచాలని, రోజుకి 600 రూపాయలు వేతనం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేని పరిస్థితిలో తీసుకొచ్చిన అప్పులు కట్టలేక ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి భారతదేశంలో చూస్తా ఉన్నాం. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు పార్లమెంట్లో చర్చలేకుండా తీసుకువచ్చి 400 రోజులుగా ఢిల్లీలో పోరాటం చేస్తా ఉంటే 750 మందిని పొట్టన పెట్టుకుంది. కేంద్ర ప్రభుత్వం రైతు పండించిన గిట్టుబాటు ధర కావాలని, అలాగే బర్లీ పొగాకు సంబంధించి మద్దతు ధర ఇవ్వాలని చెప్పి డిమాండ్ చేయడం జరిగింది.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులర్ చేయాలని అనేక డిమాండ్స్ తోటి ఈరోజు ఈ కార్యక్రమం జరుగుతా ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్నటువంటి లేబర్ కోడ్స్ వ్యతిరేకంగా నాలుగు సంవత్సరాల నుంచి అనేక పోరాటాలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వెనుకడుగు వేయకుండా అన్ని రాష్ట్రాలకు సర్కులర్ జారీ చేయడం జరిగింది.అన్ని రాష్ట్రాల్లో దీని కోసం కావాల్సిన ప్రయత్నం చేస్తా ఉన్నారు.ఈ ప్రయత్నం కూడా ఉమ్మడిగా ఐక్యంగా తిప్పికొట్టేటువంటి ప్రయత్నం చేస్తా ఉన్నాం.దానిలో భాగంగానే ఈ కార్యక్రమం జరుగుతుంది. కాంట్రాక్ట్ కార్మికులు , అవుట్సోర్సింగ్ కార్మికులు కోట్ల సంఖ్యలో రిక్రూట్ చేసుకోవడం జరిగింది.కనీస వేతనాలు లేకుండా సామాజిక భద్రత లేకుండా కార్మిక చట్టాలు అమలు చేయకుండా కొద్దిపాటి వేతనంతోటి జీవనం గడపాల్సిన పరిస్థితి ఉంది. ఈ విధానాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఉద్య మించాలని చెప్పి ఉద్యోగులకి కార్మికులకు పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలని , 200 రోజులకు పని పెంచాలని, రోజుకి 600 రూపాయలు వేతనం ఇవ్వాలని ఇంకా అనేక సమస్యలు ఉపాధి హామీ పథకం పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని చెప్పి ఆంజనేయులు డిమాండ్ చేయడం జరిగింది.రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి. మాట్లాడుతూ. స్కీం వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.డి సర్దార్, ఒంగోలు నగర నాయకులు శ్రీరాం శ్రీనివాసులు, సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, నాయకులు చీకటి శ్రీనివాసరావు తంబి శ్రీనివాసులు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు రాజశేఖర్, దాసరి సుందరం, జార్జి, సారథి పాల్గొని జయప్రదం చేశారు.

711.0 మి.మీల వర్షపాతం నమోదు

విశాలాంధ్ర -ఒంగోలు టౌన్: అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లాలో 711.0 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం వరకు 444.8 మి.మీలు నమోదు కాగా, మంగళవారం ఉదయం వరకు 266.2 మి.మీలు వర్షపాతం నమోదు అయినది. సోమవారం 38 మండలాలకు గాను 30 మండలాలలో వర్షపాతం నమోదు కాగా అందులో అత్యధికంగా కొత్త పట్నంలో 56.4 మి.మీలు, అత్యల్పంగా దొనకొండ దొనకొండలో 1.8 మి.మీలు నమోదు అయినది. మంగళవారం 38 మండలాలకు గాను 28మండలాలో వర్షపాతం నమోదు అయినది. అందులో అత్యధికంగా కొండెపిలో 52.8 మి.మీలు నమోదు కాగా, అత్యల్పంగా గిద్దలూరులో 1.2 మి.మీలు నమోదు అయినది. మధ్యాహ్న సమయం నుండి కొంత పొడి వాతావరణం ఏర్పడినది.

టంగుటూరి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఆంధ్రకేసరి స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు, సంతనూతలపాడు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, బి.ఎన్.విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్ కుమార్, జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమడు టంగుటూరి సంతోష్ ను సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విలేకరులతో మాట్లాడుతూ, దేశస్వాతంత్ర్య పోరాటంలోనూ, దేశాభివృద్ధిలో టంగుటూరి ప్రకాశం పంతులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు. ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ, ధైర్యసాహసాలకు ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులు గారని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. రాజకీయాలలో వారు నెలకొల్పిన విలువలు మనకు ఆదర్శమన్నారు. సంతనూతలపాడు శాసన సభ్యులు విజయకుమార్ మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో ఎంతో ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ త్యాగం చేసి దేశ స్వాతంత్ర్యంలో పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం మనకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, సెట్వెల్ సీఈఓ శ్రీమన్నారాయణ, ప్రకాశం భవనంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రేవు నుంచి వాహనాలు వెళ్లే రహదారులను తొలగించాలని ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడే వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేయాలన్నారు. ఆ వాహనాలను వెంటనే విడిచిపెట్టకుండా భారీగా జరిమానాలు విధించాలన్నారు. మరోసారి అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 2021 నుంచి 2024 సంవత్సరం వరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు ఉపగ్రహ ఛాయాచిత్రాల ద్వారా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీసాక్ నివేదిక ఆధారంగా జెపి వెంచర్స్ ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రజల అవసరాల మేరకు ఇసుక రేవును నూతనంగా గుర్తించామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. జువ్వలపాలెం-2 ఇసుక రేవులో ఇసుక లభ్యత ఉందన్నారు. ఇక్కడ ఇసుక వినియోగం కొరకు జిల్లాస్థాయి కమిటీ తీర్మానించి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు ప్రకటించారు. జువ్వలపాలెం-2 రేవులో 24.9 హెక్టార్లలో ఇసుక లభ్యత అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేవరకు ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం భట్టిప్రోలు ఇసుక రేవులో 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందన్నారు. అలాగే గాజుల్లంక ఇసుక రేవులో 19వేల మెట్రిక్ టన్నుల లభ్యత ఉందన్నారు. ప్రజల అవసరాల కొరకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు.ఈ సమావేశంలో జిల్లా మైన్స్ ఏడి రాజేష్, డిటిఓ పరంధామ రెడ్డి, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారి రాఘవేంద్రరావు, బాపట్ల, రేపల్లె ఆర్డీవోలు పి.గ్లోరియా, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం..రైతన్నకు కష్టం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో సోమవారం మంగళవారం కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో కోసిన మిరపకాయలు, నువ్వుల గూళ్ళు., మొక్కజొన్న విత్తనాలు తడిసిపోయాయి. మండలంలోని ముండ్లమూరు, పసుపుగల్లు, ఉల్లగల్లు, పులిపాడు, బసవపురం, ఈదర. భీమవరం, పూరి మెట్ల, ఉమామహేశ్వరపురం, తమ్మలూరు. నాయుడుపాలెం, వేంపాడు, పోలవరం,శంకరాపురం, మారెళ్ళ, సుంకర వారి పాలెం, సింగనపాలెం తదితర గ్రామాలలో నువ్వు కోతల కోసి గూళ్ళు ఏర్పాటు చేశారు, అకాల వర్షానికి నువ్వుల గూళ్ళు తడిసిపోయాయి. మిరపకాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా వర్షం కురవడంతో అవి కొంతమేర తడిసిపోయాయి. రైతులు నీటిని బయటకు పంపించి పరదా ప ట్టాలు కప్పారు. అకాల వర్షానికి పంటలు తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట కోత పూర్తిగా 90 శాతం మేర అమ్మకాలు పూర్తి అయ్యాయి. కోత కోసి అమ్మేందుకు సిద్ధంగా ఉన్న 10 శాతం మొక్కజొన్న గింజలు తడవకుండా ఉండేందుకు రైతులు పరదా పట్టలు కప్పారు.

మహానాడు

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అలాగే ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మంత్రివర్యులు, ప్రకాశం జిల్లా నియోజవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు, ఎమ్మెల్సీ, నామినేటెడ్ హోదాలో ఉన్న చైర్మన్లు, డైరెక్టర్లు జిల్లా మహానాడు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఒంగోలు నగరంలో మే 23 శుక్రవారం జరగనున్న లిప్రకాశం జిల్లా మహానాడు సభా కార్యక్రమానికి ప్రకాశం జిల్లా పరిధిలోని రాష్ట్ర మెయిన్ కమిటీ సభ్యులు, రాష్ట్ర అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, జిల్లా పార్టీ మెయిన్ కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, రాష్ట్ర మరియు జిల్లా బీసీ సాధికార సమితి కమిటీ సభ్యులు, అన్ని నియోజకవర్గాల సమన్వయ కమిటీ సభ్యులు, నగర, పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, గ్రామ కమిటీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపిటిసిలు, మాజీ జెడ్పిటిసి లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, జిల్లా-నియోజకవర్గాలలోని నామినేటెడ్ పదవుల్లో ఉన్న సభ్యులు, వివిధ హోదాలలో ఉన్న ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ తప్పకుండా హాజరు అయ్యి లిప్రకాశం జిల్లా మహానాడులి సభను విజయవంతం చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

'టంగుటూరి'కి ఎస్పీ నివాళి

విశాలాంధ్ర-ఒంగోలు : స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరిగా పేరుగాంచిన స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ దామోదర్ మరియు పోలీస్ అధికారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1872 ఆగష్టు 23న ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, వినోదరాయుని పాలెం గ్రామంలో సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించారన్నారు. చిన్నతనంలో కష్టపడి విద్యాభ్యాసం చేసి లండన్‌లో బారిష్టర్ పాసై ప్రముఖ న్యాయవాదిగా సేవలందించారని, గొప్ప దేశభక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, మేధావి, ధీరుడు, కార్యదక్షుడని, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో బ్రిటిష్ పోలీసుల తుపాకీ తూటాలకు ఎదురుగా గుండె చూపిన ఆయన సాహసం ఎన్నటికీ మరువలేనిదని, ప్రత్యేకంగా రాష్ట్ర సాధనలో నిర్ణయక పాత్ర పోషించాడని, 1953 అక్టోబర్ 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రిగా ప్రజాసేవకుడయ్యారని, ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలు ఎప్పటికీ ఆదర్శప్రాయమన్నారు. తెలుగు జాతికి చేసిన సేవలను గుర్తుగా 1972 డిసెంబర్ 5న ఒంగోలు జిల్లా పేరును ప్రకాశం జిల్లాగా మార్చారని, ప్రకాశం పంతులు తెలుగువారి తెగువకు, నిబద్ధత, ధైర్యం, సమైక్యతకు నిలువెత్తు నిదర్శనమని, అలాంటి మహనీయుని జీవితాన్ని, ధైర్యసాహసాలు, పోరాట పటిమను నేటి, భావితరాలు ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఇన్స్పెక్టర్ జగదీష్, ఆర్ఐ రమణ రెడ్డి, ఏఆర్ ఎస్సైలు ప్రసాద్, పాపి రెడ్డి పాల్గొన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు..

- నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తాం
- ఉప్పుగుండూరు పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఉప్పుగుండూరు పంచాయతీ రికార్డులను తాను ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉంచామనేది అవాస్తమని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. కిరణ్ కుమార్ పేర్కొన్నారు. తాను రికార్డులను ఇతరుల వద్ద ఉంచానని తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కేవలం కొద్దిరోజులు సెలవుమాత్రమే పెట్టానన్నారు. ఈ క్రమంలోనే పంచాయతీ సాధారణ సమావేశానికి సంబంధించిన పుస్తకాలు, ఇన్చార్జ్ పంచాయతీ కార్యదర్శి అయిన బి.వెంకట రమణారావుకు అందజేసినట్లు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ కృపాచారికి ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించ లేదన్నారు. కావున రికార్డుల అంశం అతని పరిధిలోనికి రానిదన్నారు. ఇక సర్పంచ్ చెక్పవర్ పునరుద్ధరణ అంశం ఉన్నతాధికారుల పరిధిలో ఉందన్నారు. వారు తీసుకున్న నిర్ణయం మేరకే చెక్ పవర్ పునరుద్ధరిం చారన్నారు. అయితే గతంలో ఇంచుమించు రూ.42 లక్షల అక్రమాలపై మరోసారి విచారణ సాగుతోందన్నారు. ప్రస్తుతం ఈ అంశంపై మార్కాపురం డీఎల్పీవో విచారణ అధికారిగా ఉన్నారన్నారు. గతంలో అవినీతి జరిగిందా..? లేదా..?. బాధ్యులు ఎవరనే అంశం విచారణలో తేలుతుందన్నారు. ఇక తాను రికార్డులు సక్రమంగానే నిర్వహిస్తున్నా నన్నారు. అదేవిధంగా సిబ్బంది వేతనాలు సక్రమంగా చెల్లిస్తున్నట్లు వివరించారు.

మాతృభాష బోధనతోనే విద్యార్థుల్లో వికాసం

- తెలుగు మాధ్యమం కొనసాగించాలి
- ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్

విశాలాంధ్ర -ఒంగోలు : మాతృభాషలో విద్యాబోధన చేయడంతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది కాబట్టి రాష్ట్రంలోని పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని కొనసాగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టియు ప్రకాశం జిల్లా కార్యదర్శి గవిని శివశంకర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 1 నుండి ఎనిమిది తరగతులు బోధించే ప్రాథమికోన్నత స్థాయిలో తెలుగు ఉపాధ్యాయులను తొలగించడం విద్యాశాఖ పాఠశాలల్లో తెలుగు మాధ్యమం లేదని ఉత్తర్వులు ఇవ్వడం కూటమి ప్రభుత్వానికి తగదని ఆక్షేపించారు. కూటమి పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశాయని, అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు మాధ్యమాన్ని విస్మరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. తెలుగు దేశం పార్టీ పేరులోనే తెలుగు ఉందని అటువంటిది తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకపోతే భావితరాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వాపోయారు. జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం ట్రిబుల్ ఐటీ, ఎంబిబిఎస్ వంటి కోర్సులు సైతం తెలుగులో బోధించాలని నిబంధనలు ఉన్నప్పటికీ ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు మాతృభాషకు పెద్దపీట వేస్తుంటే ఇక్కడ మాత్రం తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు మాతృభాషలో చదువుకోవడం వలన సులభంగా నేర్చుకుని భావవ్యక్తీకరణ చేయగలుగుతారు కాబట్టి తెలుగు మాధ్యమం కొనసాగించి పిల్లలు వారికి ఇష్టం వచ్చిన మాధ్యమం ఎంచుకునే అవకాశం ప్రభుత్వం కల్పించాలని తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న తెలుగు భాషను, మన సంస్కృతిని కాపాడుకోవడానికి విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వడానికి తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని కోరారు. అదేవిధంగా పాఠశాల పునర్వ్యవస్థీకరణ లో భాగంగా 9 రకాల పాఠశాలలో ఫౌండేషన్ స్కూల్స్ అనే పేరు తొలగించి 1 నుండి 5 తరగతులుగా ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి,1 నుండి 20 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో పోస్టు 31 నుండి 44మంది విద్యార్థులకు మూడో పోస్టు కేటాయిస్తూ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, పిఎస్ హెచ్ఎం పోస్టులను ఎస్ జి టి ఉపాధ్యాయులకు ప్రమోషన్ ఇచ్చి భర్తీ చేయాలని,హైస్కూల్లో సర్ ప్లస్‌గా ఉన్నటువంటి స్కూల్ అసిస్టెంట్స్ ను డిసెండింగ్ ఆర్డర్లో ఇస్తూ యూపీ అండ్ హైస్కూల్లో సర్దుబాటు చేసి డీఈవో పూల్ నందు ఎవరు మిగలకుండా చూడవలెను. అప్పటికి సర్ ప్లస్‌గా మిగిలి ఉంటే రిటైర్ అయినటువంటి ఉపాధ్యాయుల పోస్టుల నందు వీరిని కేటాయించవచ్చని సూచించారు.

26న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఈ నెల 26వ తేదీ సోమవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు మండల వైస్ ఎంపీపీ వై భారతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా మంగళవారం తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పిటిసి, ఎంపీటీసీలు,సర్పంచులు కోఆప్షన్ సభ్యులు హాజరవుతారన్నారు సమావేశానికి వచ్చే సిబ్బంది మండల స్థాయి అధికారులు శాఖల వారీగా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. గైర్హాజరైన అధికారులపై శాఖపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

రైతు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : రైతులు, కార్మిక, కర్షక ఉపాది కూలీలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశ వ్యాప్త హర్తాళ్‌లో భాగంగా మంగళవారం ఉప్పుగుండూరు, కండ్లగుంట, అమ్మనబ్రోలు తదితర గ్రామాల్లోని సచివాలయ కార్యదర్శులకు వినతి పత్రాలు అందచేసారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంతిబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాల కారణంగా రైతు పండించిన ఏపంటకు గిట్టుబాటు ధరలేక అప్పులపాలై ఆత్మహత్యల వైపు దారితీస్తుందన్నారు. ప్రస్తుతం పండించిన శనగ, మిర్చి, పొగాకు, మినుము తదితర పంటలకు గిట్టుబాటు ధరలేక కేనే నాధుడు లేక రైతులు దివాలా తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అదేవిదంగా బర్లీ పొగాకు కొనుగోలు లేక కౌలు రైతులు కూలీలకు డబ్బులు ఇవ్వలేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు కాలువల్లో పూడిక తీయాలని, సాగుచేసే రైతులకు అన్నదాత సుఖీభవ నిదులు విడుదల చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో పాలపర్తి యోనా, రావెళ్ళ వెంకట్రావు, ఎస్ కృష్ణారావు, ఎన్ రామారావు, కె చిరంజీవి వివిధ రంగాల కార్మికులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర - కనిగిరి: స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో మంగళవారం నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నూతన కార్యవర్గం సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. 99 న్యూస్ ఛానల్ రిపోర్టర్ షేక్ బాషా అధ్యక్షుడిగా ఎన్నిక కాగా సిహెచ్ నరసింహారావు (బుజ్జి) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

మా స్థలం ఆక్రమించారు..

విశాలాంధ్ర- ఒంగోలు : ప్రభుత్వం వారు తమకిచ్చిన భూమిని వెంటనే తమకు అప్పగించాలని, అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆశాభీ మీడియా ముందు వాపోయారు. ఒంగోలులోని ఎంపీపీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆశాభి మాట్లాడుతూ తన భర్త షేక్ ఖాజావలి 2021లో పోలీస్ స్టేషన్లో లాకప్‌లో మరణించారన్నారు. దీంతో అప్పటి కలెక్టర్ ఎస్పీ ద్వారా రూ. 20 వేలు పరిహారం, పాత సుజాతనగర్ లోని సర్వే నెంబర్ 279/1బి1 లో 0.02 1/2 సెంట్ల భూమిని ఇచ్చారన్నారు. అయితే అప్పటినుండి ఆ స్థలంలో తాము గుడిసె వేసుకుంటుండగా పేరయ్య అనే వ్యక్తి తమకు అడ్డు తగులుతున్నారని, తమను స్థలంలోకి రానివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నరని ఆరోపించారు. పేరయ్య కోర్టులో కేసు వేశారని, కోర్టులో కూడా తమకు అనుకూలంగానే తీర్పు వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ పేరయ్య తనని స్థలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదన్నారు. చివరకు మునిసిపాలిటీ వారు కూడా మున్సిపాలిటీ స్థలం అంటూ బోర్డులు పెట్టారని పేర్కొన్నారు. చివరికి కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి తమ స్థలాన్ని తమకు ఇప్పించవలసిందిగా కోరారు. సమావేశంలో ఆశాభి ఇద్దరు కుమార్తెలు పాల్గొన్నారు.

రేపు మినీ మహానాడు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఒంగోలు సమీపంలోని త్రోవగుంట వద్ద గల విష్ణు ప్రియా ఫంక్షన్ హాల్ నందు ఈనెల 22వ తేదీ నాడు జరిగే మినీ మహానాడును జయప్రదం చేయాలని సంతనూతలపాడు శాసనసభ్యులు బి ఎన్ విజయ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమానికి బాపట్ల పార్లమెంట్ సభ్యులు తేనేటి కృష్ణ ప్రసాద్ పాల్గొంటారని మద్దిపాడు నాగులుప్పలపాడు చీమకుర్తి సంతనూతలపాడు మండలాల పరిధిలోని టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలోని జయప్రదం చేయాలని వారు కోరారు.

టంగుటూరి జీవితం ఆదర్శనీయం

విశాలాంధ్ర - తాళ్లూరు: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, అనంతరం దేశాభివృద్ధిలోను టంగుటూరి పకాశం పంతులు పాత్ర ఎంతో కీలకమన్నారు. టీడీపి మండల పార్టీ అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వర రెడ్డి, ఎంపీడీఓ దారా హనుమంత రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రెడ్డి ఓబులు రెడ్డి,శాగం కొండా రెడ్డి, పార్టీ ఒంగోలు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి మానం రమేష్ , క్లస్టర్ ఇన్‌చార్జి రాచకొండ వెంకట రావు, ఇడమకంటి శ్రీనివాస రెడ్డి, హనుమంత రావు, కార్యాలయ ఏవో సానికొమ్ము సత్యం, వ్యవసాయధికారి ప్రసాద రావు , ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత వెంకటేశ్వర రెడ్డికి సన్మానం

విశాలాంధ్ర -తాళ్లూరు: తెలుగు దేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మేడగం వెంకటేశ్వర రెడ్డిని మండల పార్టీ నాయకులు ఎంపీపీ ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుఛ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ అభ్యున్నతికి అందరితో కలిసి ముందుకు సాగుతానని, అందరూ తమ సహకారం అందించాలని మేడగం వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు, తాజా మాజీ పార్టీ అధ్యక్షుడు బొమ్మి రెడ్డి ఓబులు రెడ్డి, పార్టీ పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శులు మానం రమేష్, శాగం కొండా రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రాచకొండ వెంకట రావు, ఇడమకంటి శ్రీనివాస రెడ్డి, హనుమంత రావు పాల్గొన్నారు.

అంగనవాడి కేంద్రంలో 'కిశోర వికాసం'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని మోట్రావులపాడు అంగన్వాడి కేంద్రం నందు మంగళవారం ఆడపిల్లల పట్ల లింగ వివక్ష, అసమానతలు అంశంపై కిషోర్ బాలికలకు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడ మైనది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవి ఎస్ పార్వతి మాట్లాడుతూ లింగ వివక్ష వల్ల ఆడపిల్లలకు సమాన అవకాశాలు, హక్కులు, వనరులకు ప్రాప్యత కష్టమవుతుండటం వల్ల విద్య, ఆరోగ్యం, ఆర్థిక ,ఉద్యోగ మరియు సామాజిక రంగాలలో అసమానతల వల్ల బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణ, హింసకు గురి చేస్తున్నాయని అన్నారు. లింగ వివక్ష రకాలను, లింగ వివక్షకు కారణం విద్య లేకపోవడం, పేదరికం, పితృ స్వామ్య వ్యవస్థ, ఆచారాలు, మూఢనమ్మకాలు మొదలైనవి కారణమని అన్నారు. బాల్యవివాహాలను, లింగ వివక్షతను నిర్మూలించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించిరి. కార్యక్రమంలో ఫెసిలిటేటర్ గా ఎం ఎస్ కె షేక్. అబీద ,ఏఎన్ఎం పి. అన్నమ్మ, ఆశా వర్కర్ ఎస్ .ప్రమీల అంగన్వాడీ కార్యకర్తలు కె. సుబ్బలక్ష్మి, రత్తమ్మ ,గ్రామంలోని కిషోర్ బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఎడ్ల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-పీసీపల్లి : ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలోని పెదఅలవలపాడు పంచాయతీ పరిధిలోని వెంగళపురం గ్రామ సమీపంలో పాలేటి గంగ దగ్గర 36 అడుగుల అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని జాతీయస్థాయి ఎడ్ల పోటీలను మంగళవారం స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు పోటీల ప్రారంభానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు అనంతరం 36 అడుగుల అభయాంజనేయ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్ల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ధృఢమైన శరీరం నడకలో రాజసం పందెంలో పౌరుషంతో దేశం గర్వించదగ్గ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన చూస్తుంటే పండగ వాతావరణం కనిపిస్తోందని ఉగ్ర అన్నారు. యాంత్రికరణ లేని రోజుల్లో వ్యవసాయానికి అండగా నిలిచిన ఎద్దును ప్రోత్సహిస్తూ ఈప్రాంత సంస్కృతిని ముందుకు తీసుకెళుతున్న 36 అడుగుల అభి ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కొంపల్లి మాలకొండయ్య అభినందనీయులన్నారు. ప్రస్తుత కాలంలో ఇలాంటి ఔత్సాహిక గ్రామీణ పోటీలు కరువయ్యాయన్నారు. మంగళరం నిర్వహించిన వ్యవసాయ విభాగం ఎడ్ల పోటీలలో వైయస్సార్ కడప జిల్లా కాజీపేట మండలం రహమత్నాన్ పల్లి గ్రామానికి చెందిన ఇరగం రెడ్డి లక్ష్మీరెడ్డి బాపట్ల జిల్లా ఉప్పుమగులూరు గ్రామానికి చెందిన తనుబోద్ది రవిశంకర్ రెడ్డి రైతులకు చెందిన రెండు జతలు 5113.3 మీటర్లు లాగి మొదటి బహుమతి రూ 50116 సాధించగా పత్తిపాడు మండలం పెదగొద్దపాడు గ్రామానికి చెందిన గరికపాటి వెంకట్ జీవిఆర్ బుల్స్ 5002.7 మీటర్లు లాగి రెండవ బహుమతి రూ 40116 సాధించినట్లు నిర్వాహకులు తెలియజేశారు. బుధవారం జూనియర్ ఎడ్ల విభాగ ప్రదర్శన గురువారం సీనియర్ ఎడ్ల విభాగ ప్రదర్శన జరుగుతుందని ఈ పోటీలు మరో రెండు రోజులు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు అశేషంగా తరలివచ్చారు.

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పొదిలి తాలూకా నూతన కమిటీని పొదిలిలోని సన్ షైన్ స్కూల్లో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదిలి తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులుగా కొనకనమిట్ల వైద్యాధికారి డాక్టర్ ఎస్పీ బాలయ్య, ప్రెసిడెంట్ గా పిసి నారాయణరెడ్డి, సెక్రెటరీగా ఈ సుధా మారుతి ,ట్రెజరర్ గా వై బాల వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్గా గా డి వంశీకృష్ణ ,వి నరసారెడ్డి బి శ్రీను, జాయింట్ సెక్రెటరీలుగా ఏ దివాకర్, టీవీ నాగరాజ్ కుమారి, కే శార జి పుణ్యవతి లను ఎన్నికల అధికారి ఎన్ వి సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆర్ వెంకటేశ్వర్ రెడ్డి బి మస్తాన్ నాయక్ ఎన్నికల అధికారుల సమక్షంలో 11 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ను మండల కేంద్రమైన పామూరు పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కెబి ధీయేటర్ లో ఎన్టీఆర్ అభిమానుల మధ్య 5కేజీ ల కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఆర్టీసీ బస్టాండ్ వద్ద 20 మంది అనాధలకు భోజనం మరియు మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. అనంతరం అభిమాన సంఘ నాయకులు మాట్లాడుతూ తన నటనతో, నడవడికతో తెలుగు ప్రేక్షకుల మన్ననలను పొందుతూ దూసుకుపోతున్న ఎన్టీఆర్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో చిరకాలం వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ జూ ఎన్టీఆర్ ఫ్యాన్స్ మెంటా ఆనంద్, పెరమన విజయ్ కుమార్ చారి, నాగేంద్ర, సుకేష్, లక్ష్మణ, సద్దాం, వినయ్, భార్గవ్ ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా బాబురావు రెండోసారి ఎన్నిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండల. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా మురబోయిన బాబురావు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మార్కాపురంలో జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో మండల నాయకులు రెండవసారి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరోమారు టిడిపి కన్వీనర్ గా ఎన్నికైన బాబురావుకు రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కామసాని రామిరెడ్డి ,నాయకులు తాటిరెడ్డి వెంకటేశ్వర్లరెడ్డి, స్థానికము వెంకటేశ్వర్లరెడ్డి, కనకము నరసింహారావు, తెలుగు యువత నాయకులు గొట్లగట్టు సర్పంచ్ పెరికెసుకుదేవ్ ,కే గురవయ్య పలురు నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

పెండ్యాలను అభినందించిన బైరెడ్డి, దారపనేని

విశాలాంధ్ర-పామూరు రూరల్ : నెల్లూరు జిల్లా వరికుంటపాడులోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతో భక్తి శ్రద్ధలతో కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామిని భక్తులు ఇలవేల్పుగా భావించి మొక్కులు తీర్చుకుంటుంటారు. అటువంటి వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని భక్తులందరికీ నిత్యం దర్శనం చేసుకునేందుకు ఎన్నో వ్యయ ప్రయాసాలతో దేవస్థానాన్ని నిర్మించిన ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ రావును దారపనేని చంద్రశేఖర్, బైరెడ్డి జయరామిరెడ్డిలు అభినందించారు. వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో దేవస్థానంలో శుభకార్యాలు జరుపుకునేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారని పెండ్యాల సూర్యనారాయణరావును కొనియాడారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బైరెడ్డి, దారపనేని లకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

రైతులను దగా చేస్తున్న పొగాకు కంపెనీలు

- ప్రభుత్వం స్పందించిన కంపెనీలు స్పందన లేదు
- 12,500కు పొగాకును కొనుగోలు చేయాలి
- రోడ్డుపై బైఠాయించి రైతుల నిరసన

విశాలాంధ్ర - పర్చూరు : పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు మంగళవారం స్థానిక బొమ్మల సెంటర్లో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పొగాకు కంపెనీల ప్రతినిధులు పొగాకు రైతులకు మోసపూరిత మాటలతో కాలయాపన చేస్తున్నాయని, ప్రభుత్వం స్పందించిన కంపెనీ యాజమాన్యం స్పందించడం లేదని, పొగాకును 12,500 కొను గోలు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. ప్రభుత్వం స్పందించి పొగాకును కొనుగోలు చేసేలా కంపెనీలపై చర్యలు తీసుకోవాలని లేదా మార్క్ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొగాకు కంపెనీ ప్రతినిధులు ప్రభుత్వం చేపట్టిన చర్యలను కూడా ఖాతర చేయడం లేదని, రైతులను ఆదుకొనుటకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రైతు సంఘం నాయకులు గంగయ్య, కృష్ణయ్య, శ్రీనివాసరెడ్డి, బందారు చినదాసు, మత్తేదేవిడ్, ఆకుల వెంకటేశ్వరరావు, రైతులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-యద్దనపూడి : మండలంలోని వింజనం పాడు గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చిత్రపటానికి గ్రామస్తులు పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే ఏలూరి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా వింజనంపాడు నుంచి తిమ్మరాజుపాలెం వరకు 7.50 కోట్లతో నూతన రోడ్డు నిర్మాణం,మరమత్తులకు నిధులు మంజూరు చేయించినందుకు. గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుల చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నాటి సమస్యను ఎమ్మెల్యే కృషితో పరిష్కారం అవుతుందని, ఈ రహదారి నిర్మాణం పూర్తి అయితే వింజనంపాడు, పోలూరు, శ్యామల వారి పాలెం, గ్రామాలలో వర్షాకాలంలో ప్రజలు పడుతున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వజ్జా సుబ్బరామయ్య, సాదినేని రంగారావు, సాగినేని సుధీర్, వజ్జా వీరయ్య, నల్లపునేను మల్లికార్జునరావు, మాకినేని శివ రామకృష్ణ, గోపాలం యశ్వంత్, సిహెచ్ బాపయ్య, కోడూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రకాశం పంతులు వర్ధంతి

విశాలాంధ్ర - అద్దంకి : స్వాతంత్ర సమర యోధుడు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్య మంత్రి స్వర్గీయ ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో మంగళవారం అద్దంకిలో ఘనంగా నిర్వహించారు. బంగ్లా రోడ్డులో ఉన్న ప్రకాశం పంతులు కాంస్య విగ్రహానికి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రకాశం మిత్ర మండలి అధ్యక్షులు వీరవల్లి సుబ్బారావు, గాదేపల్లి దివాకర దత్తు, మహమ్మద్ రఫీ, పుట్టం రాజు శ్రీరామచంద్రమూర్తి, మన్నం త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఉచిత అవగాహన

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయములో హైదరాబాద్ నిజాం ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూషన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ ఎక్విప్మెంట్తో ఫిజియోథెరపీపై ఉచిత అవగాహన మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో వివిధ కారణముల వలన ఏర్పడు నొప్పులకు ఇతర ఇబ్బందులకు తీసుకొనవలసిన జాగ్రత్తలను ఫిజియోథెరపీ వైద్యులు వివరించారు. ఈ క్యాంపు ఆవశ్యకత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.స్వరూపరాణి తెలియజేసి ఉన్నారు. ఈ కార్యక్రమములో .ఎంపిడిఓ కె.సుమంత్, కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, ఎం.జి.యన్.ఆర్.ఇ.జి.ఎస్.సిబ్బంది సచివాలయము సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ మినీ మహానాడు జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర-సంతమాగులూరు : అద్దంకి నియోజక వర్గ స్థాయిలో జరగనున్న తెలుగుదేశం పార్టీ మినీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ బాపట్ల పార్లమెంటు అధికార ప్రతినిధి, సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేల్లప్రోలు రమేష్ మంగళవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 22న ఉదయం 10గంటలకు అద్దంకి పట్టణం, నాగులుపాడు రోడ్డులో ఉన్న కామేపల్లి కళ్యాణ మండపం నందు మహానాడు సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా అద్దంకి ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతారని చెప్పారు. కావున సంతమాగులూరు మండల పరిధిలోని టీడీపీనేతలు, ఆడపడుచులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

కారు బోల్తా వ్యక్తి మృతి..ఇద్దరికి స్వల్ప గాయాలు

విశాలాంధ్ర - కొరిశపాడు : మేదర మెట్ల జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం సుమారు 6:30 గంటల సమయంలో వేగం అదుపు చేయలేక కారు బోల్తా పడి వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలి గ్రామం చెందిన ఏడుగురు వ్యక్తులు ఏపీ 39 బి.ఎల్ 5355 నెంబర్ గల కారులో తిరుపతి నుండి వాళ్ళ స్వగ్రామం వెళుతుండగా మార్గ మధ్యలో కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం బాలాజీ బాయిల్డ్ రైస్ మిల్ సమీపంలో నేషనల్ హైవేపై ఒంగోలు నుండి గుంటూరు రోడ్ లో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలను ప్రకారం కారు నడుపుతున్న పూజారి లక్ష్మణరావు అనే అతను నడుపుతున్న కారుని నడుపుతూ వేగం అదుపు చేయలేక కారు మార్జిన్ లోకి వెళ్లి బోల్తా కొట్టింది.ఈ ప్రమాదంలో సుంకర నాగరాజు వయసు (21) సంవత్సరాలు అక్కడికక్కడే చనిపోయాడు. కారులో మిగిలిన వారికి ఇద్దరికి చిన్న చిన్న రక్త గాయాలు అయ్యాయని ఈ ప్రమాదంపై మేదరమెట్ల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్తో మహిళ మృతి

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో యనమదల గ్రామంలో విద్యుత్ షాక్ తో ఒక మహిళ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కటారివారిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి యలమందయ్య కుటుంబం జీవనోపాధి కోసం 7 సంవత్సరాల క్రితం యనమదల గ్రామం వచ్చి రైస్ మిల్ అద్దెకు తీసుకొని జీవనోపాధి కొనసాగిస్తు న్నారు. రైస్ మిల్ దగ్గర నివాసం ఉంటున్నారు. ఉదయం 11:15 నిమిషాల సమయంలో మేడి శెట్టి సుబ్బయమ్మ(59) ఇంట్లో నుంచి బయటకు వెళుతూ విద్యుత్ వైరు తగిలి విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. ఎస్సై రత్నకుమారి తన సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి మృతదేహాన్ని నిమిత్తం పోస్టు మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె మృత దేహాన్ని టిడిపి నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వర రావు, సింగ్ చంద్రశేఖర్, దొడ్డ అప్పారావు, దొడ్డ మహి శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు.

డీఈఓ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - అద్దంకి : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 21న తలపెట్టిన ఒంగోలు డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం అద్దంకిలోని ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ స్థాయి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సమావేశం జరిగింది. నాయకులు మల్లాది నాగరాజు జగన్నాథం బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అసంబద్ధ నిర్ణయాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కొరకు డీఈఓ కార్యాలయము ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాల న్నారు. ఉన్నత పాఠశాలలో అదనపు సెక్షన్కు 45కు ఇవ్వాలన్నారు. ఎస్జిటిలకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. ముట్టడి కార్యక్రమానికి అద్దంకి నియోజక వర్గంలోని ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లికార్జున రావు, రామయ్య, ఎలీషా, రాజశేఖర్ శ్రీహరి ,పూర్ణచంద్రరావు, రాఘవయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనానికి స్థలం అప్పగింత

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి పట్టణంలో గ్రంథాలయ స్వంత భవనానికి రాష్ట్ర మంత్రి గొట్టి పాటి రవికుమార్ చొరవతో ఇటీ వల జిల్లా కలెక్టర్ అద్దంకిలో స్థలాన్ని మంజూరు చేయడం జరిగింది. దీనికి సంబంధించి మంగళవారం తహసిల్దార్ శ్రీ చరణ్ రెవెన్యూ సిబ్బందితో ఎన్ఎస్పి కాలనీలో 10 సెంట్లు స్థలాన్ని కొలతలు వేయించి హద్దురాళ్ళు ఏర్పాటు చేసి జిల్లా గ్రంథాలయ శాఖకు అప్పగించారు. కార్యక్రమంలో అద్దంకి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నం త్రిమూర్తులు, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ వసుంధర దేవి, విశ్రాంత గ్రంధ పాలకులు చుండూరి సుగుణరావు పాల్గొన్నారు.

రాతి ముఖ మండపం దాతలకు సత్కారం

విశాలాంధ్ర-అద్దంకి : సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ రాతి ముఖ మండపంకు విరాళాలు ఇచ్చిన దాతలను మంగళవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయుడు ఘనంగా సత్కరించారు. స్వామివారి చిత్రపటాలు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. దాతలు ప్రసన్నాంజ నేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంఎస్ఎంఈ రుణాలపై మహిళలకి అవగాహన

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : బాపట్ల పురపాలక సంఘ కార్యాల యం కౌన్సిల్ హాల్ లో పట్టణ లోని స్వయం సహాయక మహి ళలతో మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సమావేశం నిర్వహించారు. ఎంఎస్ఎంఈ రుణాలు పురోగతి, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారి గృహాలకు విద్యుత్కు ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో కేంద్ర ప్రభుత్వం అందించే సోలార్ ప్యానల్ను అమర్చుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.

పొగాకు కొనుగోలు చేయాలని తహశీల్దారుకు వినతి

విశాలాంధ్ర-యద్దనపూడి : మండలంలోని రైతులు, రైతు సంఘం నాయకులు తహసీల్దార్ కే రవి కుమార్‌కు పొగాకు కొనుగోలుపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ యద్దనపూడి మండలంలో అన్ని గ్రామాలలో ఈ ఏడాది బర్లీ పొగాకు రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారన్నారు. సాగులో కౌలు రైతులు అధికంగా ఉన్నారని, కౌలు,పెట్టుబడులు, కూలి ఖర్చులు, ఎక్కువ మొత్తంలో ఖర్చులు అయినవని, పండించిన పంట చేతికొచ్చిన తర్వాత కొనేనాథుడు కరువై రైతుల ఇళ్లల్లోనే మగ్గుతుందన్నారు. ప్రభుత్వం పొగాకు రైతులను ఆదుకోవాలని కోరారు. జిపిఐ, ఐటిసి, డెక్కన్ కంపెనీ ప్రతినిధులు వచ్చి కొంటామని చెప్ప డం తప్ప ఆచరణ సాధ్యం కావడం లేదని, ప్రభుత్వం పొగాకు బోర్డు ద్వారా గాని , ప్రభుత్వ సంస్థల ద్వారా గాని కొనుగోలు చేయించి పొగాకు రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, ఈదల శ్రీనివాసరావు, వి కృష్ణమూర్తి, జీ వెంకట్రావు, వై హనుమంతరావు, శేషాద్రి, నరేష్ ,మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గత ప్రభుత్వం రేషన్ డీలర్ల ఆత్మ గౌరవాన్ని దెబ్బ కొట్టి, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వృధాగా ఖర్చుచేసి ఏర్పాటు చేసిన ఎండియు వాహనాల విధానాన్ని రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని మండల రేషన్ డీలర్స్ అధ్యక్షులు నాగుల పున్నారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మరలా రేషన్ డీలర్లకు ఊపిరి పోసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లకు ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్స్ సంక్షేమ వేదిక అధ్యక్షులు ముత్యాల శేషగిరిరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి త్రిపురం రవిచంద్రరెడ్డిలకు డీలర్స్ అందరి తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మా డీలర్స్ పై నమ్మకం ఉంచి కూటమి ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వానికి మన డీలర్ వ్యవస్థకు మంచి పేరు తేవాలని డీలర్లను కోరారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - సంత మాగులూరు : పుస్తకాలు చదవడం, చదివిన విషయాలను రాయడంపై దృష్టి పెడితే మేధోశక్తి పెంపొందు తుందని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి పిల్లలకు సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో 19వ రోజు మంగళవారం నిర్వహించారు. 20మంది విద్యార్థులు హాజరై, పుస్తకాలు చదవడం, ఆటపాటలతో సరదాగా గడిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను లైబ్రరీకి పంపించాలని లైబ్రేరియన్ విజ్ఞప్తి చేశారు.

ఏడాదంతా పంటలతో ఆదాయం

విశాలాంధ్ర - సంతమాగులూరు : రైతులు సాగు చేసేభూమి చిన్నదా, పెద్ద దాని కాకుండా ప్రణాళికా బద్ధంగా రసాయన రహిత సేంద్రియ పద్ధతిలో విభిన్న పంటలు సాగు చేయడం వల్ల ఏడాదంతా ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ డీఎంటీ దిండు సుబ్బారావు చెప్పారు. మంగళ వారం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్, పీఎండీఎస్ విధానంపై ఏల్చూరు యూనిట్ పరిధిలోని ఏల్చూరు-6లో వీఓఎ నక్క లక్ష్మీ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి సేద్యంచేస్తూ ఆదర్శంగా నిలిచిన రైతులు నక్క రామ కోటేశ్వరరావు, నక్క హరిబాబులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఐసీఆర్పీ సంధ్యారాణి, రైతులతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు.

చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం

– ఆరుంబాక చేనేత సహకార సంఘం అధ్యక్షులు దివి రాంబాబు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గడచిన ఐదు సంవత్సరాల కాలంలో అవసానదశకు చేరుకున్న చేనేత రంగానికి కొత్త ఊపిరి అందించి పూర్వ వైభవం దిశగా కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరుంబాక చేనేత సహకార సంఘం అధ్యక్షులు, ఆప్కో బోర్డ్ మాజీ డైరెక్టర్ దివి రాంబాబు అన్నారు. కూటమి నాయకులు ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని దీనిలో భాగంగానే చేనేత రంగాన్ని కూడా ఆదుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. గడచిన పది రోజులలోనే చేనేత రంగ శాఖ మంత్రి యస్ సవిత రాష్ట్రంలోని చేనేత నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ రంగానికి కావలసిన మౌలిక సదుపాయాల గురించి చర్చించటం జరిగిందని వాటిని అమలు చేసేందుకు అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారన్నారు. 2018 సంవత్సరంలోనే సహకార సంఘాలకు కాలం చెల్లినప్పటికీ ఎన్నికలు జరుపుకుండా తాత్సారం చేసి సంఘంలో ఓటు హక్కు లేని వారికి కూడా అధికారం కట్టబెట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడింది వైసిపి ప్రభుత్వం అన్నారు. ఇప్పుడు వైకాపా నాయకుల మాటలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని చేనేత మీద ప్రేమ ఉన్నట్లు కపటనాటకాలు ఆడుతున్నారన్నారు గత ప్రభుత్వ హయాంలో ఉన్న పథకాలకు తిలోదకాలు ఇచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 2014–19 మధ్య నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలన్నీ మరల పునరావృతం అవుతాయన్నారు. రానున్న రోజులలో చేనేత రంగానికి మంచి రోజులు వస్తాయని వలన పోయిన కార్మికులు కూడా తిరిగి చేనేతను ప్రారంభించేలాగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘ నాయకులు కందుల వెంకటేశ్వర్లరావు, దివి శ్రీనివాసరావు, ఒరుగంటి శివ నాగేంద్రం, పంచుమర్తి వీర రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు కొనాలని రైతుల ధర్నా

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలోని నల్లబర్లీ పొగాకు పండించిన రైతులు తమ వద్ద ఉన్న పొగాకును వెంటనే ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కొనుకోలు చేయాలని మంగళవారం ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కమ్యూనిస్ట్ పార్టీ రైతు సంఘం నాయకులు పాల్గొని పొగాకు రైతులకు మద్దత్తు ఇచ్చి రైతులు పొగాకు సింపనీల మాటలు విని నిండా మునిగారని ప్రభుత్వం సైతం 75 మిలియన్ కేజీల పొగాకు నిల్వ ఉందని అధికారికంగా ప్రకటించి ఇప్పుడు కేవలం 1 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు అనుమతి ఇవ్వడం చాలా దారుణం అని ఇది రైతులనుమోసం చేయ డమేనని దుయ్యబట్టేరు ధర్నా అనంతరం జె పంగులూరు మండల తహసీల్దార్ పోపూరి సింగారావును మండల రెవిన్యూ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇవ్వగా అయన జి పి ఏ పొగాకు కంపెనీ యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి మండలంలోని రైతులవద్ద ఉన్న నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయా లని అడుగగా వారు సానుకూలంగా స్పందించారని అదే విధంగా రైతుల వినతిపత్రం మేరకు విషయాన్నీ ప్రభుత్వానికి తెలు స్తానని తద్వారా రైతులకు తగిన న్యాయం జరిగేలా తనవంతు ప్రయ త్నం చేస్తానని రైతుసంఘం నాయకులకు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయ కులు రాయిని వినోద్‌బాబు, మల్లారెడ్డి, తల్లపనేని రామా రావు, నాగ భైర రంగారావు వినతిపత్రం ఇచ్చిన రైతులు పి కోటేశ్వర రావు, జి రామసుబ్బయ్య, పి లక్ష్మయ్య, వి సుబ్బారావు మండలంలోని నల్లబర్లీ పొగాకు రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివి

– ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : కార్యకర్తల త్యాగాలు వెలకట్టలేనివి అని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మంగళవారం ఇసుక దర్శి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం నందు పర్చూరు నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు గత వైసీపీ ప్రభుత్వంలో టిడిపి కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసారన్నారు గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి అసమర్ధ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పర్చూరు నియోజకవర్గంలో 13.25 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం కు నిధులు విడుదల చేసిన ఘనత తెదేపాదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల అధ్యక్షులు తెదేపా నాయకులు, కార్యకర్తలు ఏలూరి అభిమానులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ ఆశా కార్యకర్తలు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆవుల సురేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, అసంఘటిత కార్మిక సమగ్ర చట్టం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని విరమించుకోవాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి బాల నర్సయ్య, అరికట్ల శ్రీను, అంగన్వాడీ ఆశ, కార్యకర్తలు నిశనం రాణి, పత్రా విజయ్ కుమారి, కే సునీత నాగమణి ,నాగమ్మ ,పి అరుణ ఆయాలు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ కృష్ణకు సన్మానం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని త్రిపురాంతకం పట్టణ టైలర్ అసోసియేషన్ సభ్యులు వైస్ ఎంపిపి పాటిబండ్ల కృష్ణను శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి వెంకటరావు ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. మేడపి ప్రాథేసిక సభ్యులు, వైస్ ఎంపిపి కృష్ణ ను అభినందించారు. ఇంకా అనేక ఉన్నత పదవులు సంపాదించాలని కోరారు. టి కోటి, వెంకటేశ్వర్లు, జి శ్రీను,డి శ్రీను, శంకర్, నాసర్‌వలి, జి ప్రసాద్, కాశయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

పడమర కట్టకిందపల్లి టీడీపీ అధ్యక్షుడిగా 'గట్ల'

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని టీడీపీ పార్టీ అధ్యక్షులుగా గట్ల కొండారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాలమేరకు మంగళవారం పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. టిడిపి అధ్యక్షులుగా గట్ల కొండారెడ్డి, ఉపాధ్యక్షులుగా తిరుమలశెట్టి చందు, ప్రధాన కార్యదర్శిగా మద్దిబోయిన కొండయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసమావేశంలో మండల టిడిపి అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమా శ్రీనివాస్, రాష్ట్ర టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్ రావు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు, క్లస్టర్ ఇంఛార్జీ గుంటుపల్లి శ్రీను, యస్. కె రసూల్(కావేరి) భజ్జి రమణయ్య, దేవదానం,వెంకటరెడ్డి స్థానిక టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

భూసేకరణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక : కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లా నుంచి వెళుతున్న ప్రధాన రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటు చేసుకొని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా చెప్పారు. ఆయా అంశాల పై మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణతో కలసి సంబంధిత 1. 565, 544(డి), 167 (బి), 765, 544 (జి), కాళహస్తి రైల్వే మార్గాల నిర్మాణ ప్రాజెక్టులపై చర్చిం చారు. ఆయా నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ కోసం నిధుల చెల్లింపు, పెండింగ్ క్లెయిమ్స్, యాజమాన్య హక్కుల వివా దాలపై కలెక్టర్ ఆరా తీశారు. వీటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక కోసం రూపొందిం చుకోవాలని చెప్పారు. వీటి పురోగతిపై సీఎం కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నట్లు ఆమె తెలిపారు. పాదర్తి, గుండా యపాలెం, పిన్నివారి పాలెం తది తర గ్రామాలలో భూముల లభ్యతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి అవసరాన్ని బట్టి వాటిని సేకరి ంచే విషయంలో ఒక స్పష్టత తీసుకో వాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ చిన ఓబు లేసు, మార్కా పురం సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, కనిగిరి. ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పాల్గొన్నారు.

కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర-చీమ కుర్తి: కేంద్రప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు నిర్వహిస్తూ దేశవ్యాప్త ంగా నిరసన ప్రదర్శన చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు రైతుసంఘాలు పిలుపులో భాగంగా చీమకుర్తి పంగులూరి కృష్ణయ్య భవన్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతు ప్రజా వ్యతిరేక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. సిఐటీయు మండల కార్య దర్శి పల్లా పల్లి ఆంజనేయులు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పామిడి వెంకట్రావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దూకుడుగా కార్పొరేట్ కంపెనీ లకు ఉపయోగపడే విధానాలను వేగంగా అమలు చేస్తున్నారని ప్రజల మీద భారాలు మోపుతుందని ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు ఇతను చేస్తున్నారని అన్నారు. సిఐటియు మండల నాయకులు పాటిబండ్ల పద్మ, బిందె ఆంజనే యులు, కనకరాజు, పి. ఏడుకొండలు, రైతు సంఘం మండల అధ్యక్షులు కార్యదర్శులు బెజవాడ శ్రీను, కే.చిన్నపరెడ్డి, వ్యవసాయ మార్కెట్ సంఘం మండల అధ్యక్షులు సేలం ఆదినారాయణ, టి. రామారావు, నల్లూరి కృష్ణయ్య, పి. నరసింహారావు, పి. జానీ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులు గొప్ప ధైర్యశాలి

విశాలాంధ్ర-ఒంగోలు: ఒంగోలు లో ఉన్న ప్రకాశం జిల్లా కలెక్టరు కార్యాలయం ఆవరణలో ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహానికి పుష్పమాలతో అలం కరించి వారి 68వ వర్ధంతి వేడుక లను బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంక చిరంజీవి ఆధ్వర్యంలో ఘన ంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బంక చిరంజీవి మాట్లాడుతూ మన దేశ స్వాతంత్రం కొరకు పోరాడిన స్వాతంత్ర్య సమరవీరుల్లో టంగుటూరు ప్రకాశం పంతులుగారు కొనియాడదగ్గ గొప్ప నాయకుడన్నారు. సోషల్ జస్టిస్ ఫొరం నాయకులు అంగలకుర్తి నరసింహారావు బీసీ నాయకులు పెద్దన్న, యాదవ జేఏసీ అధ్యక్షులు చిరుమామిళ్ల గోపి మురళి కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ జయంతికి దద్దాలకు ఆహ్వానం

విశాలాంధ్ర-కనిగిరి: స్థానిక కొత్తూరులోని అభయా ంజనేయ స్వామి దేవాలయంలో ఈనెల 22వ తేదీన జరగనున్న హనుమాన్ జయంతి వేడుక లకు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ను అంగన్వాడి విభాగం జనరల్ సెక్రటరీ తమ్మినేని సుజాత, జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కొత్తూరు వైసిపి నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షులు ఆవుల కృష్ణారెడ్డి, ముల్లంగి శ్రీహరి రెడ్డి, అచ్చాల శ్రీనివాసులరెడ్డి, మడతల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అంబేద్కర్ భవనం కొరకు కనిగిరి ఆర్డీఓకు వినతి

విశాలాంధ్ర-కనిగిరి : భారత రాజ్యా ంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ భవనం కనిగిరిలో ఇంత వరకు లేకపోవడం చాలా బాధాకర మని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు.సోమవారం కనిగిరి రెవిన్యూ డివిజన్ కార్యాల యంలో కనిగిరి రెవిన్యూ డివిజనల్ ఇంచార్జి ఆర్డిఓ వెంకట శివరామి రెడ్డి కి కనిగిరిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం కొరకు స్థల పరిశీలన చేయుటకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఆర్డీవో సానుకూలం గాను స్పందించి ఉన్నత అధికారులు దృష్ట్యా త్వరిత గతిన స్థల పరిశీలన చేయుటకు చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలతో దాదాపుగా 50 శాతం వున్నారు.కనిగిరి ప్రాంతం లోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు తప్పనిసరిగా అంబేద్కర్ భవనం చాలా అవసరమని ఆయన తెలియజేశారు. చైర్మన్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కో ఆప్షన్ సభ్యులు ఖాసీంసా, పులి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి యువతరానికి ఆదర్శనీయుడు టంగుటూరి

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, తెలుగుజాతి గర్వించ దగిన మహానేత స్వర్గీయ టంగుటూరి ప్రకాశం పంతులు 68వ వర్ధంతి వేడుకలను మంగళ వారం స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్శిటీ నందు ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిపాలనా భవనం వద్ద ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులు నిలువెత్తు చిత్ర పటానికి ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి,హరిబాబు,యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. రాజ మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలామణి, సిడిసి డీన్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర తదితరుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజ మోహన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలా మణి, సిడిసి డీన్ ప్రొఫెసర్ జి సోమ శేఖర లతో బాటు బోధన, బోధనేతర సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టాలి

విశాలాంధ్ర-సంతనూ తలపాడు : మండలం లోని గృహ నిర్మాణా లను లబ్ధిదారులు వేగ వంతంగా చేపట్టాలని ఎంపీడీవో డి సురేష్ బాబు ఆదేశించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాల యం నందు మంగళవారం హౌసింగ్ డిప్యూటీ ఇంజనీర్ పి చెన్నరాయుడు మండల హౌసింగ్ ఏఈ వి కిరణ్ రాజు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లా డుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం ఇటీవల అదనపు నిధులను విడుదల చేసిందని లబ్ధిదారులు వేగవంతంగా నిర్మించుకు నేందుకు వారిని చైతన్య పరచాలని కోరారు. ముందుగా హౌసింగ్‌శాఖ అధికారులు చంద్ర పాలెం గ్రామ లే అవుట్‌లను పరిశీలించి ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేపట్టా లని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ నాగలక్ష్మి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దయ్యేంతవరకు
పోరాటాలు కొనసాగించాలి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : రైతు కార్మిక శ్రామికుల సమస్యలు పరిష్క రించాలని దేశవ్యాప్త నిరసనలో భాగంగా మండల కేంద్రమైన పామూ రులో ఏఐటీయూసీ, సీఐటీయూలు వేర్వేరుగా మంగళవారం నిరసనలు తెలిపి అధికారులకు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాలు అందజేశారు. ఈ సంద ర్భంగా ఏఐటీయూసీ నాయకులు సయ్యద్ మౌలాలి, సీఐటీయూ నాయకులు కొమ్మల పాటి మాల్యాద్రిలు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు అమలు చేయాలని ఈఎస్ఐ, బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ విధానాల ద్వారా కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టా లను రద్దు చేసారన్నారు. పనిలేని సందర్భంలో కూలీలకు పనికల్పించే లక్ష్య ంతో ఏర్పడిన ఉపాధిహామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తుంద న్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయించాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రూ.600లు కూలీ ఇవ్వాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయ కులు పాలపర్తి మస్తాన్రావు, వజ్రాల సుబ్బారావు, రైతు సంఘం నాయకులు రఘునాథరెడ్డి, రాగిపాటి సూరిబాబు, సురేష్, సిఐటియు నాయకులు కే శంకర్,వైవీ నారాయణ సిహెచ్ వెంకటేశ్వర్లు , వీఆర్ఏ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నారాయణమ్మ, రసుల్‌బీ, మస్తాన్ పి శ్రీను, హిమాంహుస్సేన్, కొండమ్మ భీభి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సమయపాలన ఉండాలి

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటు లో ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా అన్నారు. మంగళ వారం మండలంలోని పి, రాళ్ళపల్లి సచివాలయాన్ని ఆయన సందర్శించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు ప్రజా సమస్యల కోసం ప్రతిరోజు ఎన్ని అర్జీలు వస్తున్నాయని ఎన్ని అర్జీలు పరిష్కరించారని అడిగి తెలుసుకు న్నారు సచివాలయానికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీపై జీలుగా, జనములు విత్తనాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని రైతు లకు 50 శాతం రాయితీ పై జీలుగలు, జనములు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ తెలియజేశారు. ఖరీఫ్ సీజన్లో పచ్చిరొట్టపైర్లుగా సాగు చేసుకునేందుకు రైతులకు బాగా ఉపయోగపడతాయి అన్నారు. పచ్చిరొట్ట పైర్లను విత్తుకొనుటకు ప్రస్తుత ఉన్న వాతావరణం సరైనదని అన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దుక్కులు దున్నుకొని పచ్చి రొట్ట ఎరువు పంటలను సాగు చేయాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లను సాగు చేయ డం వలన నేల గుల్లగా మారి నీరు ఇంకె గుణం పెంచుతుందన్నారు. నెల లో దీనివలన సూక్ష్మజీవులు పెరిగి జీవ రసాయనక చర్యలు జరగడం వలన నేలలో సారంపెరిగి ఉత్పాదకత సారం పెరుగుతుందన్నారు. జీలుగా ఒక క్వింటా ధర.రూ.5150లు కాగా జనుములు ఒకక్వింటా ధర రూ.5450లు కాగా, రైతు వాటాగా చెల్లించాలని తెలిపారు. వీటి సాగువలన భూమిలోని సేంద్రియ కర్బనశాతం పెరుగుతుందని తెలిపారు. ఒక ఎకరాకు జను ములు 16 కేజీలు, ఒక ఎకరాకు జీలుగులు 12 కేజీలు, ఒక ఎకరాకు పిల్లి పెసర 8 కేజీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విత్తనాల కొరకు రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబరు తీసుకొని మీ గ్రామాల్లో గల రైతు సేవ కేంద్రాలకు వెళ్లి పర్మిట్లు రాయి ంచుకోవాలని తెలిపారు. ఏఈఓ వేమూరి శ్రీ కీర్తి, పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ఛైర్మన్‌తో ఎమ్మెల్యే ఏలూరి భేటీ

- మార్క్ ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు చేయండి
- ప్రభుత్వానికి నివేదిక అందించిన ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - మార్టూరు : టొబాకో బోర్డ్ ఛైర్మన్ సిహెచ్ యశ్వంత్‌తో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. నల్లబర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేయకపోవడంపై ఎమ్మెల్యే ఏలూరి ఇటీవల కాలంలో ప్రభుత్వానికి రైతాంగ సమస్యలను తీసుకెళ్లారు. ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు,వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తో భేటీ నిర్వహించి పొగాకు కంపెనీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయినా పొగాకు కంపెనీలు పంట కొనుగోలు చేయకపోవడంతో ఎమ్మెల్యే ఏలూరి పట్టు వదలని విక్రమార్కుడిలా పొగాకు కంపెనీలపై ప్రభుత్వంతో వివిధ మార్గాల ద్వారా ఒత్తిడి తీసుకొస్తున్నారు. పొగాకు సమస్యపై ఎమ్మెల్యే ఏలూరి రూపొందించిన ఒక ప్రత్యేక నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఇదే అంశంపై మంత్రుల క్యాబినెట్ సమావేశంలో పంటలు కొనుగోలుకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే ఏలూరి పొగాకు బోర్డు ఛైర్మన్ తో భేటీ నిర్వహించారు. పంట ఉత్పత్తులకు సంబంధించి కీలక నివేదికను అందజేయడంతో పాటు, ప్రాసెసింగ్ యూనిట్లు, వాటి కెపాసిటీ, గతంలో మార్కెట్ ఎక్స్పోర్ట్, ఆయా కంపెనీలు, వాణిజ్యానికి సంబంధించిన ఏదో విషయాలపై నిశితంగా చర్చించారు. పొగాకు బోర్డు ఎన్నో ఏళ్లుగా ఉన్న డేటాను ఎమ్మెల్యే ఏలూరి తీసుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరి వద్ద ఉన్న నివేదికను ప్రభుత్వానికి అందజేశారు.

మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి : మార్క్ ఫెడ్ ద్వారా నల్లబర్లీ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివ రావు ప్రభుత్వాన్ని కోరారు. క్యాబినెట్ కమిటీ సమావేశంలో పొగాకు కొనుగోలుకు సంబంధించి కంపెనీలకు కొంత సమయం ఇచ్చి చూద్దా మని, తర్వాత ఏం చేయాలో నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

ఆత్మకూరి చెన్నయ్య వర్ధంతి సభ

విశాలాంధ్ర-ఒంగోలు : బహుజన పోరాట యోధుడు ఆత్మకూరి చెన్నయ్య పదవ వర్ధంతి సభ ఒంగోలు సీపీఐ ఆఫీసులో మే నెల 25వ తేదీ సాయ ంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరి చెన్నయ్య స్మారక సమితి కన్వీనర్, న్యాయవాది కాటుకూరి బాబు రావు తెలిపారు ఈ మేరకు ఒంగోలు అంబేద్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక సామాజిక విముక్తి పోరాటాలకు చెన్నయ్య కేంద్ర బిందువుగా నిలిచారని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్య క్షుడిగా మాన్యవర్ కాన్షిరాంను జిల్లాకు తెచ్చి గొప్ప బహుజన ఉద్యమాన్ని నిర్మించిన వారిలో చెన్నయ్య అగ్ర స్థానంలో నిలిచారన్నారు. ఈ వర్ధంతి సభలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫె సర్ చల్లపల్లి స్వరూప రాణి అంబేద్కర్ బౌద్ధ దృక్పథంపై స్మారక ఉపన్యాసం చేస్తారని, ప్రముఖ రచయి తలు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ సభలో పాల్గొని ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. ప్రజలు ప్రజాస్వామికవాదులు ఈ వర్ధంతి సభలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో స్మారక సమితి ప్రతి నిధులు దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి, మన్నం వెంకటేశ్వర్లు, కాకుమాను కిరణ్ కుమార్, చప్పిడి కోటేశ్వరరావు, పాపబత్తిని కొండలరావు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-కనిగిరి: స్నేహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, అనాథలకు, యాచకులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భిణీ మహిళలకు, పేదలకు మా వంతు సహకారం అందిస్తామని, పేదల ఆకలి తీర్చడం ఎంతో సంతోషంగా ఉందని ఇటు వంటి సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడు మా వంతుగా స్నేహస్తం చాటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఉంటామని తెలియజేశారు.

నల్లమడ వాగు విస్తీర్ణం పెంచాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : నీటిపారుదల శాఖ డ్రైనేజీ శాఖల పరిధిలో నిర్వహించే ఆపరేషన్ నిర్వహణ పనులను తనిఖీ చేసి అధికారులకు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పలుసూచనలు చేశారు. బాపట్ల జిల్లాలో నీటిపారుదల శాఖ డ్రైనేజీ శాఖలు నిర్వహించే మరమ్మత్తుల పనులను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొలుత జిల్లెలమూడి గ్రామంలోని నల్లమడ వాగులో కోతకు గురైన కరకట్ట ప్రాం తాన్ని సందర్శించారు. నల్లమడ వాగులో పేరుకు పోయిన మట్టిని తొలగించాలని,వాగు విస్తీర్ణం పెంచాలని ఆయన అధికారులకు సూచించారు. నల్లమడ వాగు విస్తీర్ణతకు కావలసిన భూమి కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని బాపట్ల, రెవెన్యూ డివిజన్ అధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల జిల్లాకు నీటి సరఫరా చేసే పిటి ఛానల్‌ను వారు తనిఖీ చేశారు. ఛానల్ నుండి నీటి సరఫరా నిలుపుదల చేయడం వలన ఛానల్లోని ఇసుక మెటలను తొలగించాలని ఆయన అధికారు లకు తెలిపారు. బాపట్లకు చెందిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లోని పూడికలను తొలగించి, ట్యాంక్ యొక్క విస్తీర్ణాన్ని పెంచి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలన్నారు.దానికి సంబంధించి ప్రతిపాదన తయారు చేయాలని నీటిపారుదల శాఖ ఎస్. ఈకి జిల్లా కలెక్టర్ సూచించారు. బాపట్లకు సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుండి నీటి సరఫరాను 35 రోజుల నుండి 60 రోజులకు పెంచాలన్నారు. తదుపరి నరసాయపాలెంలోని చెరుకూరు ట్యాంక్ చానల్లోని గుర్రపుడెక్క తూటుకాడ తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ బాపట్ల ఎమ్మెల్యే ప్రారంభించారు. నరసా యపాలెం పంచాయితీ ప్రజలు పంచాయతీలో చెత్త సేకరణ విషయమై వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీ సెక్రెటరీ రాజును జిల్లా

కలెక్టర్ చెత్త సేకరణ విషయమై ప్రశ్నించారు. తదుపరి జిల్లా కలెక్టర్ మరియు బాపట్ల శాసన సభ్యులు నల్లమడ వాగు లాకులను పరిశీలించారు. నల్లమడ వాగు లాకుల గురించిన వివరాలను నీటిపారుల శాఖ ఎస్. ఈని అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ పరిరక్షణ కొరకు అక్కడ మొక్కలు నాటారు. నీటిపారుదల శాఖ, డ్రైనేజీ శాఖలో మంజూరైన పనులన్నింటినీ ఏకకాలంలో యుద్ధ ప్రాతిపదికన నిర్దేశించిన కాలంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట నీటిపారుదల శాఖ ఎస్.ఈ వెంకటరత్నం, డ్రైనేజీ శాఖ ఈ.ఈ మురళీకృష్ణ, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల తహసీల్దార్ సలీమా, నీటిపారుదల శాఖ మరియు డ్రైనేజీ శాఖలకు చెందిన డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నలకు భరోసా..పీఎం కిసాన్ మాన్ ధన్ యోజన

- అన్నదాతకు జీవితకాలం పింఛన్ కోసం కేంద్రం శ్రీకారం
- 60ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ. 3వేలు, మరణాంతరం నామినీకి రూ. 1500
- పథకం మార్గదర్శకాలపై స్పష్టతనిచ్చిన కేంద్రం

విశాలాంధ్ర - సంతమాగులూరు : వృద్ధాప్యంలో అన్నదాతలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో పథకాన్ని తీసుకు వచ్చింది. 60 ఏళ్లు పైబడిన సన్న, చిన్నకారు రైతులకు నెలనెలా రూ. 3వేలు చొప్పున జీవితకాలం పింఛన్ తీసుకునే చర్యలు చేపట్టింది. ఆ పథకమే 'ప్రధానమంత్రి కిసాన్ మాన్ ధన్ యోజన'. ఈ పథకం అమలుతీరు, ప్రయోజనాలు, ఎవరు దరఖాస్తు చేసుకోవాలనే దానిపై వివరాలు తెలుసుకుందాం.

- అర్హత ఏమిటి.. ఎంత ప్రీమియం చెల్లించాలి

ఈ పథకానికి కనీసం 14 - 40 ఏళ్ల వయస్సు ఉన్నవారు అర్హులుగా పరి గణనలోకి తీసుకోవడం జరుగు తుంది. అలాగే ఐదు ఎకరాల్లోపు సొంత వ్యవసాయ భూములు ఉన్న సన్నకారు రైతులతో పాటు పీఎం కిసాన్ లబ్ధిదారులు కూడా పథకానికి నమోదు చేసుకోవచ్చు. అదేవిధంగా పన్ను చెల్లింపు చేసేవారు, ఆర్థిక పరిస్థితి మెరుగైనవారు, సామాజిక భద్రత పథకాలు పొందుతున్న వారికి వర్తించదు. ఇకపోతే ప్రీమియం చెల్లింపు చేసే ప్రక్రియలో భాగంగా..అర్హులైన రైతులు రూ. 55 నుంచి రూ. 200 వరకు నెలనెలా చెల్లించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు ఉన్న రైతు నెలకు రూ. 55 చెల్లిస్తే.. కేంద్రం మరో రూ. 55 చెల్లించి రూ. 110 జమ చేస్తుంది. 21 ఏళ్లు ఉన్నవారు రూ. 61, 25ఏళ్లకు రూ. 80, 30 ఏళ్ల రైతులు రూ. 106, 35 సంవత్సరాల రైతులు రూ. 150, చివరిగా 40 ఏళ్ల వారు రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ప్రీమియం పూర్తయిన తర్వాత 60 సంవత్సరాల పైబడిన రైతులకు ప్రతినెలా రూ. 3వేల పింఛను లభిస్తుంది. ఒకవేళ రైతు చనిపోతే, తదుపరి నామినీగా ఎవరు పేరు అయితే ఉందో వారికి నెలకు రూ. 1500లు చొప్పున జీవితకాలం పింఛను అందుతుంది.

- దరఖాస్తు చేసుకునే విధానం ఇలా..

మీకు సమీపంలో ఉన్న సి.ఎస్.సి(మీ-సేవా) కేంద్రం వద్దకు వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్ ను సందర్శించాల్సి ఉంటుంది. తొలుత దరఖాస్తు చేయు రైతు ఆధార్, నామినీ వివరాలు నమోదు చేసిన తర్వాత అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకోవాలి. తదుపరి సదరు రైతు సంతకం చేసి అప్ లోడ్ చేయాలి. వెంటనే పింఛను కార్డు వస్తుంది. అలాగే పీఎం కిసాన్ పథకానికి అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం నగదు చెల్లించాల్సి ఉంటుంది.

వికలాంగులకు ఉద్యోగమేళ

విశాలాంధ్ర- చీమకుర్తి: ఎస్ కే ఆర్ బది రుల ఆశ్రమ పాఠశాల చీమకురి, యూత్ అండ్ జాబ్స్ ఫౌండేషన్ తిరుపతి వారి సం యుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వికలా ంగుల శిక్షణా మరియు ఉద్యోగమేళా కార్య క్రమంలో శారీరక వైకల్యం కళా అభ్యర్థులు, చెవుడు మరియు మూగ అభ్యర్థులని తీసుకొని యూత్ అండ్ జాబ్స్ ఫౌండేషన్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించబడును, శిక్షణ సమయం ఒక నెల రోజులు శిక్షణ సమయంలో భోజనం మరియు వసతి పూర్తిగా ఉచితం అదేవిధంగా శిక్షణ అనం తరం సర్టిఫికెట్ కూడా ఇవ్వబడుతుందని, వయస్సు 18 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల వరకు ఉండాలని, తీసుకురావా ల్సిన డాక్యుమెంట్స్, టెన్త్‌క్లాస్‌పాస్ సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, తీసుకొని ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీ శనివారం ఎస్కేఆర్ బదులు ఆశ్రమ పాఠశా లలో బస్టాండ్ దగ్గర మారుతి నగర్ చీమ కుర్తి నందు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు సంప్రదించ వలసిందని ఎస్కే ఆర్ బదిరులు ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ అంజిరెడ్డి తెలియజేశారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన కొడవలూరి శేషయ్య

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలం లోని పై రెడ్డిపాలెం గ్రామ ంలో మంగళవారం పొన్నలూరు చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవ శాత్తు జారీ నీటిలో పడి కొడవల్లూరి శేషయ్య (47)మృతి చెందాడు. శేషయ్య మధ్యాహ్నం 1 గంటల సమయం లో మృతి చెందాడు. శేషయ్యకు కొడుకు, కుమార్తె ఉన్నారు. స్థానికులు ఎస్సై అను కకు సమాచారం ఇవ్వటంతో సంఘటన స్థలానికి చేరు కొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.